# డ్రైవర్లకు కంటి అద్దాల పంపిణీ



**ఆదిలాబాద్ మహా :** అరైవ్ అలైవ్" లో భాగంగా గత నెల 21న రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు జరిగాయి. ఆ సందర్భంగా కంటి సమస్యలు ఉన్న వాహన డ్రైవర్లకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం ఉచిత కంటి అద్దాలు అందచేసారు. 84 మంది డ్రైవర్లకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా ఆటో డ్రైవర్లు వాహన నియమనిబంధనలు పాటించాలని, మంచి కంటి చూపు ప్రమాదాల నివారణకు దోహదపడుతుందని ఎస్పీ అన్నారు. జిల్లా పోలీసు శాఖ ప్రైవేటు ఆప్టికల్స్ సహకారంతో కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ చేయవద్దని, ప్రయాణికుల ప్రాణాలు మీ చేతిలో ఉంటాయన్న విషయాలు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రాణానష్టాన్ని తగ్గించాలని సూచించారు.వాహనాలు, ఆటోలు, టాక్సీలు రాంగ్ సైడ్ ప్రయాణించడం వల్ల ప్రమాదాలకు గురి అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రాంగ్ సైడ్ ప్రయాణాన్ని మానుకోవాలని సూచించారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై సైన్ బోర్డులు, వేగ నియంత్రణ బోర్డులు ఉన్న సందర్భంలో వాహన వేగాన్ని తగ్గించాలని, అతివేగం ప్రమాదాలకు కారణమవుతుందని తెలిపారు. పట్టణంలోని ఆటోలు అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకున్న సందర్భంలో వారి పై చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచల వెంకటేశ్వర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలి

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి & కలెక్టర్ కుమార్ దీపక్**



**బెల్లంపల్లి, మహా:** మంచిర్యాల జిల్లాలో నిర్వహిస్తున్న 2వ సాధారణమున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి & కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో నిర్వహించిన నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా తయారీ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి & కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని,నిర్దేశిత సమయంలోగా ప్రక్రియ పూర్తి చేసి నిబంధనల ప్రకారం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించాలని అధికారులకు సూచించారు.నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల ప్రక్రియ పూర్తిగా వీడియోగ్రఫీ చేయడం జరిగిందని తెలిపారు.ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు.మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లాకార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు.అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను లైంగిక వేధింపులకు గురి చేస్తే చర్యలు తప్పవు

మంచిర్యాల జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ హెచ్చరిక

**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో విధులు నిర్వహిస్తున్న మహిళలను లైంగికంగా వేధిస్తే పోష్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని మంచిర్యాల జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ హెచ్చరించారు. ఈ సందర్భంగా మంగళవారం సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఒక మహిళ లైంగిక వేధింపుల నిరోధక చట్టం పాస్ 2013 పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పని ప్రదేశాలలో మహిళలకు భద్రత, గౌరవం, సమానత్వం కల్పించడమే లక్ష్యంగా చట్టం రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలలో, వాణిజ్య, వ్యాపార సముదాయాలలో, షాపింగ్ మాల్స్, జిన్నింగ్ మిల్లులు, ఇతర పని ప్రదేశాలలో పని చేసే మహిళలు లైంగిక వేధింపులకు గురైతే బాధిత మహిళలు నిర్భయంగా అంతర్గత ఫిర్యాదు కమిటీకి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదు పై కమిటీ నిర్నీత కాలంలో విచారణ పూర్తిచేసి తగు చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. అవసరమైతే పోలీస్ కేసు నమోదు చేయడం కూడా జరుగుతుందని తెలిపారు. ప్రతి కార్యాలయంలో, పని ప్రదేశాలలో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని, మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా విస్తృతస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామనివివరించారు. పోష్ చట్టం, అంతర్గత ఫిర్యాదు కమిటీ ఉద్దేశం, హక్కులు, ఫిర్యాదు విధానం, కమిటీ నిర్మాణం, బాధ్యతలు వంటి అంశాలపై అధికారులు, ఉద్యోగులకు స్పష్టమైన అవగాహన కల్పించడం జరుగుతుందని, కమిటీ వివరాలను నిర్దిష్ట ఫారం ద్వారా సేకరించి సంబంధిత సమాచారాన్ని షీ బాక్స్ పోర్టల్ లో నమోదు చేయాలని చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో ఇప్పటివరకు 47 అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో ప్రభుత్వ జిల్లా స్థాయి కార్యాలయాలలో 30 కమిటీలు, ఉప జిల్లాస్థాయి కార్యాలయాలలో 16,ప్రైవేట్ సంస్థలు, షాపింగ్ మాల్స్, దుకాణాలలో 1 కమిటీ పని చేస్తున్నాయని పేర్కొన్నారు.ప్రైవేట్ సంస్థలు తమ సంస్థలలో కమిటీలను ఏర్పాటు చేయాలని, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం, షీ బాక్స్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు. పోష్ చట్టం అమలుతో మహిళలకు పని ప్రదేశాలు సురక్షితంగా మారుతాయని, ప్రతి మహిళ తన హక్కులను తెలుసుకొని ధైర్యంగా ముందుకు రావాలని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీకి రాజీనామా ప్రకటించిన కాంగ్రెస్ నేత సూరిబాబు

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మున్సిపల్ పాలకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరపున అభ్యర్థులను ప్రకటించిన విధానాన్ని నిరసిస్తూ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాజీమున్సిపల్ చైర్ పర్సన్ పిసిసి కమిటీ మెంబర్ మతమారి సూరిబాబు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో పాటు డిసిసి అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీనామా ప్రకటించడం మంగళవారం నాడు చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన 34 వార్డులకు సంబంధించి అభ్యర్థులను ప్రకటించిన విధానంలోపభూయిష్టంగా ఉందని ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి పెద్దపీట వేస్తూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని దశాబ్దాల కాలంగా చేస్తున్న సేవలను స్థానిక ఎమ్మెల్యే తో పాటు డిసిసి అధ్యక్షుడు విస్మరించడం ఎంతవరకు సబబు అని ఆయన తన ఆవేదనను వ్యక్తం చేసి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. 20వ వార్డు నుండి తన భార్య మతమరి సరస్వతికి వార్డు కౌన్సిలర్ గా కాంగ్రెస్ పార్టీ నుండి ప్రకటించినప్పటికీ పోటీలో నిలబడబోమంటూ ఆయన ప్రకటించారు. 34 వార్డులకు సంబంధించిన అభ్యర్థులను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రకటించిన విధానం సక్రమంగా లేదని ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి కాంగ్రెస్ పార్టీని విస్మరించి విమర్శించిన నాయకులకు వార్డు కౌన్సిలర్ అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ పార్టీ తరపున ప్రకటించడం శోచనీయంగా మారిందని పేర్కొన్నారు ఈ విషయాన్ని రాష్ట్ర అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ సైతం పూర్తి స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన వ్యక్తులను గుర్తించకపోవడం ఏమిటని కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని వివిధ కార్యక్రమాలను చేస్తూ నియోజకవర్గం తోపాటు పట్టణంలో అనేక రకాల కాలుగా పార్టీ కార్యక్రమాలను అధికారంలో ఉన్న లేకపోయినా కొనసాగించి కాంగ్రెస్ పార్టీని పార్టీకి ఎనలేని సేవలు చేయడం జరిగిందని వెల్లడించారు.పార్టీ కోసం కష్టపడిన వారికి మొండి చేయి చూపిందనిఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే క్రాంతి కార్యాలయంలో ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్న క్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో పాటు డిసిసి అధ్యక్షుడు సైతం స్పందించకుండా వెళ్లిపోవడం గమనార్హం.

# బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటించిన బిజెపి

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికలకు భాజపా పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. రెండో వార్డు నుండి పట్టి వెంకటకృష్ణ, నాలుగో వార్డ్ నుండి ఎనగందుల మౌనిక ,5 వవార్డు సముద్రాల సుధాకర్ ఆరో వార్డు నుండి ఉప్పు లక్ష్మి , 8వ వార్డు నుండి గోలి శ్రీనివాస్, 9వ వార్డు నుండి బాగ్ మోహన్,10 వవార్డు సుక్క సరిత,11 వ వార్డ్ గుర్రం శ్రావణి,12 వార్డు భూఖ్య రాజు,14వ వార్డు కళ్ళపెల్లి నవీన్,16 వ వార్డు కోయల్కర్ గోవర్ధన్,18వ వా ర్డు రచ్చ స్వప్న,20వ వార్డుదార రాజేష్, 23 వ వార్డ్ నుండి నిట్ట అరుణసుందరి, 26వ వార్డు ఇప్ప స్వామి,27వ వార్డు గంగారపు రమేష్, 28వ వార్డు గాండ్ల మహేష్,29వ వార్డు కోడి రమేష్,30వ వార్డు ఎర్రోజు స్రవంతి,34వ వార్డు కొక్కుల రామ్మూర్తి లను ఖరారు చేశారు.

# చెదురు, మధురు సంఘటనలు మినహా జిల్లాలో అభ్యర్థులకు బీఫాంలు అందజేత

**మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలకు సవాళ్లు.. విచిత్రంగా భారత కమ్యూనిస్టు పార్టీ వైఖరి**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో చెదురు, మధురు సంఘటనలు మినహా అభ్యర్థులకు కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్ పార్టీల నేతలు వారి అనుచర గణానికి బీఫాంలు అందజేత కార్యక్రమం విజయవంతమైంది. చెన్నూరు, క్యాతన్ పల్లి మున్సిపాలిటీలలో ఈ ఎన్నికలు పాలక ప్రభుత్వానికి చాలెంజ్ గా మారిందని చెప్పవచ్చు. చెన్నూరు సీనియర్ నేత మూల రాజిరెడ్డి ఈ మధ్యకాలంలో కాంగ్రెస్ పార్టీకి గుడ్ బాయ్ చెప్పి భారత రాష్ట్ర సమితిలో తీర్థం పుచ్చుకున్నారు. క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో భారత రాష్ట్ర సమితి నుండి గత ఎమ్మెల్యే బాల్క సుమన్ విధానాలు నచ్చక బింగి శివ అనుచర బృందం కాంగ్రెస్ పార్టీలో చేరి గడ్డం వివేకానంద ను ఎమ్మెల్యేగా గెలిపించడంలో చురుకైన పాత్ర పోషించారు. అయితే ఈ ఎన్నికల సమయంలో అతడు తన భార్య బింగి శివాని ఇతరులతో కలిసి రెండు రోజుల క్రితం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జాగ్రత్తలో చేరారు. ఈ రెండు మునిసిపాలిటీలలో చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానందకు ప్రతిష్టత్మకంగా మారిందని తెలుస్తోంది. ఇక బెల్లంపల్లి మున్సిపాలిటీలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఎం సూరిబాబు కౌన్సిలర్లకు బీఫామ్ ఇచ్చిన విధానంపై మండిపడుతూ తాను రాజీనామా చేస్తున్నట్లు ఎమ్మెల్యే గడ్డం వినోద్, కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి సమక్షంలో తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

**జిల్లా ఎమ్మెల్యేలకు ఈ ఎన్నికలు సవాళ్లు**

మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల, లక్షెట్టిపేట, నస్పూర్, క్యాతన్ పల్లి, చెన్నూరు, బెల్లంపల్లి మునిసిపాలిటీ ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం ఆయా ఎమ్మెల్యేలకు సవాలుగా మారినాయని చెప్పవచ్చు. ఒకవైపు రిజర్వేషన్ల ద్వారా అభ్యర్థుల ఎంపికలో ఇబ్బందులు, మరోవైపు పార్టీలో సీనియర్లు జూనియర్లకు బి ఫాం లు ఇవ్వడం. ఇంకోవైపు సొంత పార్టీకి చెందిన నేతలు తిరుగుబాటు కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేయడం జిల్లా ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారిందని చెప్పవచ్చు. సొంత పార్టీ నేతలను బుజ్జగించేందుకు డిసిసి అధ్యక్షులు రఘునాథరెడ్డి, ముగ్గురు ఎమ్మెల్యేలు వారి వారి అనుచరగారంతో వ్యూహరచన చేస్తున్నారు.

**విచిత్రంగా భారత కమ్యూనిస్టు పార్టీ వైఖరి**

మంచిర్యాల జిల్లాలో విచిత్రంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వైఖరి అవలంబిస్తుంది. (సిసిసి) నస్పూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకోగా క్యాతన్ పల్లిలో బీఆర్ఎస్ తో సిపిఐ దోస్తీ చేయడం విచిత్రంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీతో భారత కమ్యూనిస్టు పార్టీ భాగస్వామ్యం పంచుకున్న విషయం తెలిసిందే. మరి ఈ ఎన్నికలలో కామ్రేడ్ లను ఎందుకు దూరం చేసుకుందో కాంగ్రెస్ పార్టీ నేతలకే తెలియాలి. ఏది ఏమైనప్పటికీ సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాలో సిపిఐ అనుబంధ సంస్థ ఏఐటీయూసీకి కార్మికుల బలం ఉంది. దీనిని గ్రహించి ముందుగానే చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ క్యాతన్ పల్లిలో ఎర్రజెండా నేతలను కలిసి పొత్తు సంప్రదింపులు జరిపారు. రాష్ట్ర కమిటీ నేతలతో పత్రికా సమావేశం ఏర్పాటు చేసి తాము ఉమ్మడిగా మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేస్తున్నామని ప్రకటించారు. ఈ ఎన్నికలలో ఎర్రజెండా విభిన్న దోస్తీపై జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

**పోటీ దార్లకు బి ఫామ్ లు ఇచ్చిన కాంగ్రెస్, భాజాపా, బీఆర్ఎస్ లు**

మంచిర్యాల జిల్లాలో మున్సిపాలిటీ కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పలువురు పోటీ దార్లకు అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), భారతీయ జనతా పార్టీ (భాజాపా) లు తమ అభ్యర్థులకు బి ఫామ్ పత్రాలు అందజేసింది. అధికార పార్టీ నేతలు తమ అభ్యర్థులు గెలుస్తారని ఆశిస్తుండగా ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో తన సత్తా చాటి గత వైభవాన్ని చాటుకోవాలని ప్రయత్నిస్తోంది. ఇది ఇలా ఉండగాగత పార్టీ అవినీతి ఆరోపణలతో విమర్శలు ఎదుర్కొంటుండగా పాలక పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీ ఆరోపిస్తోంది. వీటినే విజయ వస్త్రాలుగా సంధించి విజయ బహుట ఎగురవేసేందుకు కమలం గుర్తు నేతలు తహతహలాడుతున్నారు.

# బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో వడపోత కార్యక్రమం అనంతరం సంబంధిత 34 వార్డులకు ఆయా రిజర్వేషన్లను అనుసరించి అభ్యర్థులను ఖరారు చేశారు. ఒకటో వార్డు నుండి మేదరి లక్ష్మి,రెండవ వాడి నుండి గుమాస ప్రవీణ్, 3వ వార్డు నుండి పోరండ్ల సత్యవతి,4వ వార్డ్ నుండి పి శాంత, 5వ వార్డ్ నుండి మేరుపల్లి పరమేష్, 6వ వార్డు నుండి దుబ్బాసి వెంకటస్వామి, ఏడవవార్డు నుండి దావ స్వాతి, ఎనిమిదవ వార్డు నుండి ఎండి నిజాముద్దీన్, 9వ వార్డు నుండి రొడ్డ శారద, పదో వార్డు నుండి డీకొండ పద్మ, 11వ వార్డు నుండి గాలి సుమలత, 12వ వార్డు నుండి జరుపుల లక్ష్మి, 13వ వార్డు నుండి బండి ఉమ, 14వ వార్డు నుండి ముక్కర సోమశేఖర్, 15వ వార్డు నుండి చింతల వసంత, 16వ వార్డు నుండి రేగుంట రమాదేవి, 17వ వార్డు నుండి రాగం శెట్టి సత్యనారాయణ, 18 వ వార్డు నుండి తస్లీమా సుల్తానా, 19వ వార్డు నుండి కాంపల్లి దయామణి, 20వ వార్డు నుండి మతమారి సరస్వతి, 21వ వార్డ్ నుండి ఎలుక ఆకాష్, 22వ వార్డు నుండి ఆకుల లత, 23 వ వార్డు నుండి జంగం కల్పన,24వ వార్డు నుండి దామెర విజయలత, 25వ వార్డు నుండి కంకటి ప్రణీత, 26వ వార్డు నుండి ఇప్ప కుమారస్వామి, 27వ వార్డు నుండి బేతి శ్రవణ్ కుమార్, 28వ వార్డు నుండి చిప్ప అర్చన, 29వ వార్డు నుండి మేడి పున్నమి చంద్రు, 30 వ వార్డు నుండి గెల్లి విజయలక్ష్మి, 31 వ వార్డు నుండి గెల్లి సంధ్య, 32వ వార్డు నుండి నీలి హారిక, 33 వ వార్డు నుండి బండి రజిత, 34 నుండి గడ్డం కవితలను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

# వేములవాడ మున్సిపల్ బరిలో 113 మంది అభ్యర్థులు

- **37 నామినేషన్ల ఉపసంహరణ**
- **ముగిసిన ఉపసంహరణ గడువు**
- **వేడెక్కిన రాజకీయం...**
- **వేములవాడ 28 వార్డుల్లో తేలిన అభ్యర్థుల జాబితా**

**వేములవాడ మహా:** మున్సిపల్ సాధారణ ఎన్నికలు 2026 నేపథ్యంలో వేములవాడ పురపాలక సంఘంలో ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. మంగళవారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో, ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. వేములవాడ పట్టణంలోని మొత్తం 28 వార్డులకు గాను తొలుత 150 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.అయితే, ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి వివిధ కారణాలతో 37 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను వెనక్కి తీసుకున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.దీంతో ప్రస్తుతం 28 వార్డుల్లో కలిపి మొత్తం 113 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారులు అధికారికంగా ఖరారు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ పర్వం ముగియడంతో ఇక ప్రధాన పార్టీల మధ్య ప్రచార పర్వం ఊపందుకోనుంది. వార్డుల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో,అభ్యర్థుల తుది జాబితా వెలువడడంతో పట్టణంలో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

# మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

**భీమేశ్వర ఆలయంలో పూజలు**

**వేములవాడ మహా:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో రానున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా భీమేశ్వర ప్రధాన ఆలయానికి వచ్చే భక్తులు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీల్‌చైర్ సదుపాయంతో నూతనంగా ఏర్పాటు చేసే ర్యాంపును పరిశీలించారు.అలాగే లడ్డూ కౌంటర్,పార్కింగ్ ప్రాంతాలు,క్యూ లైన్లు,చలువ పందిళ్లు,టెంట్లు,వీఐపీ రోడ్డు,టాయిలెట్స్,శివార్చన స్టేజీ,నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్లు,పార్వతీపురం ధర్మశాల రోడ్డుతోపాటు ఆలయ పరిసరాల్లోని వివిధ ప్రాంతాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌పరిశీలించారు. భీమేశ్వర స్వామి వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రోటోకాల్ కార్యాలయంలో 1000 రూపాయలు వేద ఆశీర్వచనం,500 రూపాయలు స్పెషల్ కోడె, 300 రూపాయలు స్పెషల్ దర్శనం టికెట్స్ అందుబాటులో ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుసుకున్నారు.

**భీమేశ్వర ఆలయంలో పూజలు**

అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారిని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం స్వామివారి మండపంలో ఆలయ ఈవో శ్రీమతి ఎల్ రమాదేవి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈలు శాంతయ్య, వరప్రసాద్, ఆలయ డీఈలు రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏఈఓలు జయకుమారి, శ్రావణ్ కుమార్, బ్రహ్మం అన్న శ్రీనివాస్, ఆలయ అర్చకులు, వేద పండితులు మరియు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# నల్లగొండ నా ప్రాణం మీ సేవలోనే నా చివరి శ్వాస..



- **ఐదుసార్లు గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలేనిది..**
- **48 డివిజన్లలోనూ హస్తం గెలవాలి నల్గొండని నంబర్ వన్‌గా నిలుపుతా..**
- **మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి కోమటిరెడ్డి భావోద్వేగం..**

**నల్లగొండ మహా :** "నల్లగొండ నా ఇల్లు ఇక్కడి ప్రజలే నా కుటుంబం ఐదుసార్లు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి గుండెల్లో పెట్టుకున్న మీ రుణం తీర్చుకోలేనిది. నా చివరి శ్వాస వరకు పేద ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తాను" అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి భావోద్వేగంతో పేర్కొన్నారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన పలు డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రికి అడుగడుగునా పట్టణ ప్రజలు నీరాజనాలు పలికారు.

**ప్రతి విద్యార్థిలో నా కొడుకును చూసుకుంటా..**

విద్యా రంగంపై తనకున్న మమకారాన్ని చాటుకుంటూ.. "ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలన్నదే నా ఆశ. అందుకే నా కుమారుడు ప్రతీక్ జ్ఞాపకార్థం అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు నిర్మిస్తున్నాను. పట్టణంలోని మరో 18 ప్రభుత్వ పాఠశాలలను త్వరలోనే మోడల్ స్కూల్‌స్‌గా మారుస్తాను" అని మంత్రి వివరించారు. పేదవాడి సొంతింటి కలను 'ఇందిరమ్మ ఇళ్ల' ద్వారా నిజం చేస్తామని, సన్నబియ్యం పంపిణీతో ఇందిరమ్మ రాజ్యాన్ని గడపగడపకూ చేరుస్తామని హామీ ఇచ్చారు.నల్లగొండను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి భారీగా నిధులు తీసుకువస్తానని మంత్రి భరోసానిచ్చారు."నల్లగొండను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దే బాధ్యత నాది. ఈ అభివృద్ధి ప్రస్థానం వేగవంతం కావాలంటే 48 డివిజన్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి. మీ సమస్యలను నా దృష్టికి తీసుకువచ్చే సమర్థులైన కాంగ్రెస్ కార్పొరేటర్లను ఎన్నుకోండి. చేతి గుర్తుకు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు పట్టణ అభివృద్ధి బాధ్యతను నేను భుజాన వేసుకుంటాను అని అన్నారు.

**విస్తృత ప్రచారం.. వెల్లువెత్తిన జనసందోహం**

మంత్రి తన ప్రచారాన్ని చర్లపల్లి (15వ డివిజన్) అభ్యర్థి పెరిక నాగరాజు, మర్రిగూడ (14వ డివిజన్) అభ్యర్థి బొజ్జ శంకరయ్యకు మద్దతుగా ప్రారంభించారు. అనంతరం 12, 26, 27, 28, 29, 30 డివిజన్లలో అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. విపక్షాల మాయమాటలు నమ్మి ఓటు వృథా చేసుకోవద్దని, శాంతిభద్రతల పరిరక్షణలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు.

# విజయీభవ.. చిట్యాల పురపోరులో గెలుపు గుర్రాలకు బీ-ఫామ్స్..

- **కనకదుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు**
- **అభ్యర్థులకు బీ-ఫారాల అందజేసిన... ఎమ్మెల్యే వేముల వీరేశం..**



**చిట్యాల,మహా:** చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికల నగారా మోగడంతో పట్టణంలో రాజకీయ కోలాహలం నెలకొంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం పట్టణంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో చిట్యాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు.అమ్మవారి దర్శనం అనంతరం, కాంగ్రెస్ పార్టీ తరపున వివిధ వార్డుల్లో పోటీ చేయనున్న అభ్యర్థులకు ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారికంగా బీఫారాలను అందజేశారు. అభ్యర్థులతో ముఖాముఖి మాట్లాడి గెలుపు వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ప్రతి అభ్యర్థి ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను వివరించాలని సూచించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.."కాంగ్రెస్ పార్టీ హయాంలోనే చిట్యాల మున్సిపాలిటీ సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుంది. గతంలో చేసిన అభివృద్ధి, భవిష్యత్తులో చేపట్టబోయే ప్రణాళికలే మనల్ని గెలిపిస్తాయి. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు..

# గాంధీనగర్ నీ మోడల్ డివిజన్ గా అభివృద్ధి చేస్తా.. 'అల్లి' మల్లికార్జున్

- **కాంగ్రెస్ గెలుపు తో గాంధీనగర్‌కు పట్టిన గ్రహణం వీడాలి..**
- **ముమ్మరంగా 39వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి అల్లి మల్లికార్జున్ ప్రచారం..**




నల్గొండ మహా : "నాడు నిర్లక్ష్యం.. నేడు అభివృద్ధికి సంకల్పం.. 39వ డివిజన్ ముఖచిత్రాన్ని మార్చే బాధ్యత నాది" అంటూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అల్లి మల్లికార్జున్ యాదవ్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. మంగళవారం గాంధీనగర్, శివాజీనగర్ ప్రాంతాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి జనం నీరాజనాలు పలికారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆశీస్సులతో బరిలో నిలిచిన ఆయన, డివిజన్ సమస్యలపై సమరశంఖం పూరించారు. వాడవాడలా ప్రచారం సందర్భంగా మల్లికార్జున్ యాదవ్ స్థానిక మహిళలు, వృద్ధులతో మమేకమై వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "గాంధీనగర్, శివాజీనగర్ ప్రాంతాల్లో అధ్వాన్నమైన రోడ్లు, అస్తవ్యస్తమైన డ్రైనేజీలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. దుర్వాసన, దోమల మధ్య జనం నరకం చూస్తున్నారు. ఈ దుస్థితికి చరమగీతం పాడాలనే లక్ష్యంతో మీ ముందుకు వచ్చాను."డివిజన్ అభివృద్ధి కోసం ఆయన తన మేనిఫెస్టోను ప్రజల ముందు ఉంచారు..పాత పార్కును కొత్త హంగులతో అధునాతన వాకింగ్ ట్రాక్, '8' షేప్ గడ్డి ప్యాచ్‌లతో సరికొత్తగా తీర్చిదిద్దుతాం.48 గంటల్లో ఏ సమస్య అయిన పరిష్కారం, 24/7 అందుబాటులో ఉండేలా 'వార్డు ఆఫీస్' ఏ సమస్య వచ్చినా ఫోన్ చేసిన రెండు రోజుల్లోనే పరిష్కరించేలా యంత్రాంగం.చోరీల నివారణకు ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలీస్ శాఖతో అనుసంధానం.డివిజన్‌లోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి, క్రమం తప్పకుండా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

**ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందాలి!**

రాష్ట్ర ప్రభుత్వ పథకాలను 'ఆ పార్టీ ఈ పార్టీ' అని కాకుండా అర్హులైన ప్రతి పేదవాడికి చేరవేస్తానని మల్లికార్జున్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు పారదర్శకంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. శివాజీనగర్ సెంటర్లను సుందరీకరించడంతో పాటు, కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి తెస్తానని చెప్పారు.హస్తం గుర్తు పై ఓటేసి నన్ను గెలిపించండి"డిప్యూటీ మేయర్ హోదాలో 39వ డివిజన్ (గాంధీనగర్) నీ మోడల్ డివిజన్‌గా మారుస్తానని, హస్తం గుర్తుపై ఓటేసి నన్ను ఆశీర్వదించండి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక నాయకులు కత్తుల కోటి, ధర్మయ్య, అంజి రెడ్డి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాలలో 'హస్తం' వైపు ఎర్రదండు...



- **కాంగ్రెస్ అభ్యర్థులకు సీపీఐ సంపూర్ణ మద్దతు..**
- **ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కీలక నిర్ణయం గెలుపు మాదేనని ధీమా**

చిట్యాల మహా : చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికల పోరులో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న కాంగ్రెస్ పాలనకు మద్దతుగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిలవాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు చిట్యాల పురపోరులో కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ సీపీఐ నాయకులు కీలక ప్రకటన చేశారు. మంగళవారం నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం ని మర్యాదపూర్వకంగా కలిసిన సీపీఐ ప్రతినిధులు, ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.సీపీఐ తరపున పోటీలో ఉన్న అభ్యర్థులు తమ మద్దతును కాంగ్రెస్‌కు తెలిపారు.02వ వార్డు ఎస్కే ఖాతీజ,07వ వార్డు, బొలుగురి సుగుణమ్మ - లింగయ్యలు ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్తి సహకారాన్ని అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ కలయికతో చిట్యాలలో కాంగ్రెస్ బలం మరింత పెరిగిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాహిత పాలన, సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరువవుతున్నాయి. అభివృద్ధిలో చిట్యాల వెనుకబడకూడదన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు అనివార్యం" అని పేర్కొన్నారు.సీపీఐ మద్దతు ప్రకటించడం పట్ల ఎమ్మెల్యే వేముల వీరేశం హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయ వాదుల మద్దతుతో చిట్యాల మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు సమన్వయంతో పని చేసి ప్రతి వార్డులోనూ భారీ మెజారిటీ సాధించాలని పిలుపునిచ్చారు.

